అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..





రేవంత్ ఆలోచనకు తగ్గట్లుగా ఫ్యూచర్ సిటీ కదిలేనా ?

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -1 శుక్రవారం 21 మే 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

## ఎబోలా వైరస్ విజృంభణ

- ఇండియా-ఆఫ్రికా సమిట్ వాయిదా
- ఎయిర్‌పోర్ట్‌లో అడ్వయిజరీ జారీ






**న్యూఢిల్లీ, మే 21 (జర్నలిస్ట్ వార్త):** ఆఫ్రికాలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి దేశాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ పరిణామాల నడుమ దిల్లీ వేదికగా ఈ నెల 28-31 తేదీల మధ్య జరగాల్సిన 'ఇండియా- ఆఫ్రికా ఫోరమ్ సమిట్' వాయిదా పడింది. భారత్, ఆఫ్రికన్ యూనియన్ మిగతా2లో...

## కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

● కనీస వేతనాలు అమలుకు నిర్ణయం ● కేబినేట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం ● లబ్దిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు ● బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు ● కెటిఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు ● మీడియా సమావేశంలో సిఎం రేవంత్



**హైదరాబాద్, మే 21 (జర్నలిస్ట్ వార్త):** కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయా రని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను మూడు భాగాలుగా విభజించాం. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్స్, మిగతా2లో...



## తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వాన

ఎండల తీవ్రతతో రికార్డు ఉష్ణోగ్రతలు

పిడుగురాళ్లలో 48.1 ముత్తారంలో 46.5 డిగ్రీలు నమోదు

**హైదరాబాద్/విజయవాడ, మే 21 (జర్నలిస్ట్ వార్త):** :ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ఏపీ, తెలంగాణలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. అంతకంతకూ ఎండ తీవ్రత పెరిగిపోయి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు బయటకు అడుగుపెట్టాలంటేనే బాబోయో ఎండ అనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురిపిస్తున్నాడా అన్నట్లుగా ఉష్ణోగ్రతలు మిగతా2లో...

## కొనుగోలు కేంద్రాల్లో మరణమృదంగం

రైతులు పిట్టల్లా రాలుతున్నా ధాన్యం కొనరా

ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడండి సిఎం గారు

23న జరిగే కేబినేట్ భేటీలో అయినా చర్చించండి

సిఎం రేవంత్‌కు కెటిఆర్ బహిరంగ లేఖ



2లో

## మణుగూరు-రామగుండం రైల్వే లైన్‌కు ఆమోదం

● రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మాణం

● మారుమూల గిరిజన పల్లెలకు పట్టనున్న మహర్దశ

● రైల్వే ప్రాజెక్టులపై అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి చర్చ



**న్యూఢిల్లీ, మే 21 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో రవాణా రంగాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కీలకమైన మణుగూరు-రామగుండం కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దాదాపు రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే తెలంగాణలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే సౌకర్యం మిగతా2లో...

## రూపాయి పతనంపై ఆర్‌బిఐ దిద్దుబాటు

అధికారులతో గవర్నర్ మల్హోత్రా మంతనాలు



2లో

## ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి రాక

పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు

**కాళేశ్వరం,మే 21 (జర్నలిస్ట్ వార్త):** సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. వీరంతా తొలుత పుష్కరస్నానం ఆచరించి ప్రారంభంచారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక మిగతా2లో...



## విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23మందికి చోటు

- ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రి యోగం

**చెన్నై, మే 21 (జర్నలిస్ట్ వార్త):** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ తన కేబినెట్‌ను విస్తరించారు. కొత్తగా 23 మంది ఎమ్మెల్యేలు నేడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. 21 మంది టీవీకే ఎమ్మెల్యేలతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్‌కు చెందిన మిగతా2లో...





## దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

● సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్

● రాజీవ్‌కు నివాళి అర్పించిన సిఎం రేవంత్



**హైదరాబాద్, మే 21 (జర్నలిస్ట్ వార్త):** దేశం కోసం ప్రాణాలర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. 'కంప్యూటర్, ఐటీ, టెలికామ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్‌గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. మిగతా2లో...



## బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

- 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిల నియామకం

**హైదరాబాద్, మే 21 (జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం కేసీఆర్ ఇన్‌ఛార్జిలను ప్రక టించారు. డిజిటల్ ప్రక్రియలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జరగనుంది. 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను బీఆర్ఎస్ అధినేత నియమించారు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు తెలంగాణ భవన్‌లో ఐటీ నిపుణులతో డిజిటల్ శిక్షణ మిగతా2లో...

## హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ

● గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనలు కోకొల్లలు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్, మే 21 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్‌లో గోవుల అక్రమ రవాణా, వధ జరుగుతోందని అన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ కొందరు కావాలనే వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ జరుగుతోందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా2లో...

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



# తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వాన

(మొదటి పేజీ తరువాయి)

రోజురోజుకూ రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. గురువారం రాష్ట్రంలో పలుచోట్ల రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో అత్యధికంగా పిడుగురాళ్లలో 48.1, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్కాపురం జిల్లా కనిగిరిలో అత్యధికంగా 48.3 డిగ్రీలు నమోదు కాగా, కృష్ణా జిల్లా కంకిపాడులో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా చింతలపూడిలో 47.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు, పల్నాడు జిల్లా అచ్చంపేటలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు, బాపట్ల జిల్లా ఇంకొల్లులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఏపీలోని వేటపాలెం (బాపట్ల), నందివాడ (కృష్ణా)ల్లో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.6, కూనవరం (పోలవరం)లో 46.5, కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 46.4, తెనాలి (గుంటూరు)లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగనుందని అధికారులు తెలిపారు. తెలంగాణ లోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. భానుడి భగభగలతో జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టడానికి భయపడుతున్నారు. ఏమైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎండలకు హడలిపోతున్నారు. గత వారం నుంచి ఉదయం మొదలు కొని సాయంత్రం వరకూ తీవ్రమైన ఉక్కపోతతో పాటు సెగలు కక్కే ఎండే కనిపిస్తూ ఉండటంతో సాధారణమైన పనులు చేసుకోవడానికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ ఎండలకు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఏసీలు ఉన్న వారు ఏసీ చాటను, ఫ్యాన్లు ఉన్నవారు ఫ్యాన్ల మాటునే సేద తీరుతూ ఊపిరి పీల్చుకుంటున్నారు. సాయంత్రం ఆరు దాటితే గానీ ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ఈ ఎండల నుంచి ఎప్పుడు ఉపశమనం పొందుతామా అని ఎదురుచూస్తున్నారు ప్రజలు.

# కొనుగోలు కేంద్రాల్లో మరణమృదంగం

**హైదరాబాద్, మే 21 (జర్నలిస్ట్ వార్త):** పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర ముఖ్యమంత్రి గారూ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి అని హితవు పలికారు. రైతుల ప్రాణాలు పోతున్నా.. పంటలు కొనరా..? కొనుగోలు కేంద్రాల్లో కుప్పకూలుతున్నా కనికరించరా అని మండిపడ్డారు. ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగ మేంటని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదని అన్నారు. ఇవాళ బూతులు తిడుతున్న రైతులే.. రేపు వాతలు పెడతారని హెచ్చరించారు. కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు రైతు చేతిలోనే కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. రైతుకు రక్షణగా కేసీఆర్ అమలుచేసిన ఒక్కో పథకానికి గత రెండేన్నరేళ్లుగా పాతరేసిన మీరు మీ చేతకాని తనంతో అన్నదాత వెన్నువిరిచారు.ఇవాళ మీ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయి. అష్టకష్టాలు పడి పండించిన పంటను కొనే దిక్కులేక రెండునెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర్థనాదాలు చేస్తున్నారు. చేతకాని మీ సర్కారు నిర్వాకం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఏ మూలన చూసినా ఈరోజు రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. పంట అమ్ముకుందామనే ఆశతో వచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు పడలేక కొనుగోలు కేంద్రాల్లోనే గుండెపగిలి కుప్పకూలుతున్నా మీ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదు. 70 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో మీకున్న శ్రద్ధలో ఒక్క శాతం రైతులపై పెట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. మీ కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి మూటలు మోయడం తప్ప రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనాలన్న సోయి మాత్రం మీలో కనిపించడం లేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద దాదాపు పదిమంది రైతులు వడదెబ్బకు తోడు సర్కారు చేసిన ద్రోహానికి తమ నిండు ప్రాణాలు కోల్పోయారు.

ధాన్యం కుప్పలు మీ అసమర్థతకు ప్రత్యక్ష సాక్ష్యాలు. విలువైన భూములను తెగనమ్మి వేలకోట్లు దోచుకోవాలన్న ఉత్సాహం తప్ప రైతుల పంటలను కొనాలన్న ధ్యాస మీలో ఏమాత్రం కనిపించడం లేదు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా అనేక జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కనీసం ఒక్కటంటే ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదు. చివరికి గన్నీ బ్యాగు కోసం రైతులే 50 రూపాయల చొప్పున డిపాజిట్ చేసే దుస్థితి తెచ్చినందుకు మీరు, మీ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి.అన్నదాతలు అడుగడుగడునా పడిగాపులు పడుతుంటే వాటిని వదిలేసి, పర్యాటక వారోత్సవాలు నిర్వహించాలన్న మీ సర్కారుకు ప్రాధాన్యతలే కాదు, చివరికి పోయి కూడా లేదని తేలిపోయింది.కేసీఆర్ హయాంలో మూడు నెల ముందు నుంచే పంటల కొనుగోలు ప్రణాళికలను పకడ్బందీగా అమలుచేసేవారు.
గన్నీ బ్యాగుల నుంచి మొదలుకుని రైతుల ఖాతాల్లో పంట డబ్బులు సకాలంలో జమ అయ్యేదాకా నిరంతర సమీక్షలతో పర్యవేక్షించేవారు.

కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల నుంచి తమ పంటను కాపాడుకునేందుకు చివరికి టార్పాలిన్లు కూడా సమకూర్చలేని మీ కాంగ్రెస్ సర్కారు ఉండి రైతులకు ఏం ప్రయోజనం అన్నారు.
రాష్ట్రమంతా రైతుల నిరసనలు హోరెత్తుతున్న ఈ తరుణంలో 23న నిర్వహించే కేబినెట్ సమావేశంలోనైనా లెంపలేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టండని కెటిఆర్ తన లేఖలో కోరారు.

# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీసవేతనం నిర్ణయించాం అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుందని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు పక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ పక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని అంటూ ఎద్దేవా చేశారు.

# మణుగూరు-రామగుండం రైల్వే లైన్‌కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

దక్కడంతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు పెద్ద ఉపశమనం లభించనుంది. మొత్తం 207.8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ సరికొత్త రైల్వే లైన్ మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాలరావుపేటలతో పాటు ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం మీదుగా వెళ్లనుంది. ప్రస్తుతం మణుగూరు నుండి రామగుండం వెళ్లాలంటే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), కాజీపేట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కానీ, ఈ కొత్త లైన్ పూర్తయితే మణుగూరు-రామగుండం మధ్య ఏకంగా 90 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీనివల్ల ప్రయాణికులకు సమయం, డబ్బు భారీగా ఆదా అవుతాయి. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులకు కనెక్టివిటీ మరింత సులభతరం కానుంది. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వెనుకబడిన మారుమూల గిరిజన ప్రాంతాలకు ఒక పెద్ద వరంగా మారబోతోంది. దశాబ్దాలుగా రైలు ముఖం చూడని ఎన్నో గ్రామాలకు ఈ లైన్ ద్వారా రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలో లభించే బొగ్గు, ఖనిజాలు, ఎరువులు , ఇతర పారిశ్రామిక సరుకు రవాణాకు ఈ రైల్వే లైన్ అత్యంత కీలకంగా మారనుంది. దీనివల్ల సింగరేణి బొగ్గు గనుల రవాణా మరింత వేగవంతం కానుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు రైల్వే శాఖ సరికొత్త ప్లాన్ సిద్ధం చేసింది. డీపీఆర్ తయారీ, భూసేకరణ, వివిధ ప్రభుత్వ శాఖల నుండి అనుమతులు తీసుకునే బాధ్యతలను రైల్వే శాఖ చూసుకుంటుంది. అయితే, ప్రాజెక్ట్ నిర్మాణం , నిధుల సమీకరణ పనులను ప్రైవేట్ భాగస్వామ్య సంస్థకు అప్పగిస్తారు.ఈ ప్రాజెక్ట్ టైమ్‌లైన్ ప్రకారం.. మొదటి ఏడాదిలో పూర్తిగా భూసేకరణ పక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత నాలుగు సంవత్సరాల్లో అంటే మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ కొత్త రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలావుంటే కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు.

# హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ

(మొదటి పేజీ తరువాయి)

గోమాత రక్షణ కోసం శాంతియుతంగా పనిచేస్తున్న గోరక్షకులు, బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. గోరక్షకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ కార్యకర్తలపై విధించిన బైండోవర్ చర్యలను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రాంచందర్ రావు సూచించారు. గోవధకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పక్షపాత ధోరణిని విడిచిపెట్టి చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. గోమాత హిందువుల జీవన విధానంలో పవిత్రమైన భాగమని, పండుగల పేరుతో గోవధ చేస్తే సహించబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే శక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.
ఈ సందర్భంగా తెలంగాణలో గోవధ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన తమ కార్యకర్తలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ఎబోలా వైరస్ విజృంభణ

(మొదటి పేజీ తరువాయి)

కలిసి ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. కొత్త తేదీలను పరస్పర సంప్రదింపుల ద్వారా ఖరారు చేస్తామని తెలిపింది. ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి సంబంధించి విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆఫ్రికా సీడీసీ, సంబంధిత సంస్థలకు మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగశాఖ పేర్కొంది. మరోవైపు.. ఎబోలా వైరస్ వ్యవహారంలో దిల్లీ ఎయిర్‌పోర్టు అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేసిన విషయం తెలిసిందే. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, నీరసం, కండరాల నొప్పులు తదితర సమస్యలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్టు వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎబోలా కారణంగా ఇప్పటివరకు 139 మంది మృతి చెందారు. దాదాపు 600 అనుమానిత కేసులను గుర్తించారు. కాంగోలో వైరస్ వ్యాప్తిని ఎదుర్కొనేందుకు తమకు మరింత సామగ్రి, సిబ్బంది అవసరమని అధికార వర్గాలు, సహాయక బృందాలు కోరాయి. మొదటి మరణం నమోదైన బునియా ప్రాంతానికి దాదాపు 20 టన్నుల సహాయ సామగ్రిని తరలించినప్పటికీ.. ఐసొలేషన్ గదుల కొరత కారణంగా వైద్యులు సాధారణ వార్డుల్లోనే ఎబోలా అనుమానిత రోగులకు చికిత్స అందిస్తున్నారు.

# రూపాయి పతనంపై ఆర్‌బిఐ దిద్దుబాటు

**ముంబయి, మే 21 (జర్నలిస్ట్ వార్త):** :రూపాయి విలువను స్థిరీకరించడానికి, వడ్డీ రేట్ల పెంపుతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పరిశీలిస్తోందని సంబంధిత అధికారులను ఉద్దేశించి 'బ్లూమ్‌బెర్గ్' గురువారం ఒక నివేదికలో వెల్లడించింది. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో సహా ఆర్‌బీఐ ఉన్నతాధికారులు వరుస అంతర్గత సమావేశాలు నిర్వహించినట్లు ఈ నివేదిక పేర్కొంది. గడిచిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో రూపాయి అంతర్గతంగా 96.95 వద్ద రికార్డు స్థాయి కనిష్టానికి పడిపోయింది. ఆ తర్వాత కోలుకుని డాలర్‌తో పోలిస్తే 96.86 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ఇండెక్స్ బలంగా ఉండటం, ముడి చమురు ధరలు అధికంగా కొనసాగడంతో డాలర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ పరిణామాల వల్లే రూపాయి విలువ చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయి, కొత్త ముగింపు రికార్డును నమోదు చేసింది. అయితే, గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి తన సర్వకాలిక కనిష్ట ముగింపు స్థాయి నుండి 41 పైసలు పుంజుకుని అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.45కు చేరుకుంది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.25 వద్ద బలంగా ప్రారంభమై, ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 96.45 వద్ద ట్రేడయ్యింది. బుధవారం నాటి ముగింపు ధర 96.86తో పోలిస్తే ఇది 41 పైసల రికవరీని సూచిస్తోంది.

# విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23మందికి చోటు

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కింది.జాతీయ మీడియా కథనాల ప్రకారం, తనకు మద్దతిచ్చిన కాంగ్రెస్‌తో పాటు ఐయూఎమ్ఎల్, వీసీకే పార్టీలకు కూడా సీఎం విజయ్ కేబినెట్ బెర్తు ఆఫర్ చేశారు. అయితే, మరికొంతకాలం తరువాత ఐయూఎమ్ఎల్, వీసీకేలు కేబినెట్‌లో చేరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సీపీఐ, సీపీఎంలను కూడా సీఎం విజయ్ మంత్రివర్గంలోకి ఆహ్వానించినట్టు మంత్రి ఆధవ్ అర్జున తెలిపారు. వీసీకే చీఫ్ తోల్ తిరుమావళన్ మంత్రివర్గంలో చేరాలని తాము ఆశిస్తున్నట్టు కూడా పేర్కొన్నారు. మే 10న జరిగిన ప్రమాణస్వీకారంలో విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఇక తమిళనాడు కేబినెట్‌లో గరిష్ఠంగా 35 మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా 23 ఎమ్మెల్యేలు మంత్రులుగా చేరడంతో మంత్రి వర్గం సంఖ్య 32కు చేరింది. దీంతో, మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కే ఛాన్స్ ఉంది.

# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సమాజం సోనియాగాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పు కొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వనున్నారు. సభ్యత్వ నమోదు కోసం డిజిటల్ యాప్‌ను రూపొందించారు. తెలంగాణ భవన్‌లో శిక్షణ తర్వాత.. పార్టీ జిల్లా కార్యాలయాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన తర్వాత.. సభ్యత్వ పునరుద్ధరణను కేసీఆర్ ప్రారంభించనున్నారు.

# ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహిణిగా సరస్వతి నది ప్రవహిస్తున్న ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్నది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండోది కాళేశ్వరంలోనే. అక్కడ కుంభమేళా నిర్వహించటం ఆనవాయితీ. కాగా, తెలంగాణలో తొలిసారి అంత్య పుష్కరాలకు సైతం ప్రాధాన్యమిచ్చి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం విశేషం. ఆది పుష్కరాల్లో నది స్నానం ఆచరించటం.. పితృతర్పణాలు ఇవ్వడం ఎలా ఫలితాలొస్తాయో.. అంత్య పుష్కర సమయంలోనూ ఆయా కార్యక్రమాలతో అవే ఫలితాలుంటాయని పండితులు చెబుతున్నారు.

# రాజీవ్ గాంధీ దేశానికి మార్గదర్శి

**: ఇంద్రసేనారెడ్డి**

**భారత మాజీ ప్రధానికి కాంగ్రెస్ నేతల ఘన నివాళి**



**ఎల్కతుర్తి/, మే 21 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ భారత రాజకీయ చరిత్రలో ఓ ప్రత్యేక అధ్యాయం అని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కోసం వారి కుటుంబం ప్రాణత్యాగాలు చేసిందని అన్నారు. యువతకు దిశానిర్దేశం చేసిన నాయకుడిగా రాజీవ్ గాంధీ నిలిచారని, విద్య, వైద్య, బ్యాంకింగ్ రంగాల్లో ఆధునిక మార్పులకు పునాది వేసిన మహానేత అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ గోలి రాజేశ్వరరావు, శనిగరపు వెంకటేష్, గొర్రె మహేందర్, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబాల స్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్‌కుమార్, మంద సుమన్, మార్కెట్ డైరెక్టర్ గొడిశాల రాజయ్య, డైరెక్టర్ బచ్చు బాబురావు, శనిగరపు స్వరూప, డాక్టర్ బొల్లెపోగు రమేష్, అంబాల శ్రీకాంత్, ఉపసర్పంచ్ మేకల బాబు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రామన్నపాలెంలో ఎన్టీఆర్ జోష్

**కేక్ కట్ చేసి ఘనంగా బర్త్‌డే వేడుకలు**




**వేంసూర్, /మే 21 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని రామన్నపాలెం గ్రామంలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు అభిమానుల హర్షధ్వానాల మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎన్టీఆర్ అభిమానులు, యువకులు, అభిమాన సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. హ్యాపీ బర్త్‌డే ఎన్టీఆర్" అంటూ నినాదాలు చేస్తూ అభిమానులు సందడి చేశారు. అనంతరం గ్రామ ప్రజలు, చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ నటన, డ్యాన్స్, డైలాగ్ డెలివరీపై అభిమానులు ప్రశంసలు కురిపించారు. తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఎన్టీఆర్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, గ్రామ యువత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామంలో వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి.

# తల్లాడలో జూనియర్ ఎన్టీఆర్ బర్త్‌డే సందడి

**కేక్ కట్ చేసిన యువనేత రాయల రాము..**

**బాణాసంచాతో అభిమానుల హంగామా**



**తల్లాడ/, మే 21 (జర్నలిస్ట్ వార్త వార్త):** మండల కేంద్రంలో సినీ నటుడు ఎన్టీ రామారావు. జన్మదిన వేడుకలు అభిమానుల హర్షధ్వానాల మధ్య ఘనంగా జరిగాయి. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మనవడిగా, తెలుగు సినీ పరిశ్రమలో అగ్ర హీరోగా ఎదిగిన జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా నందమూరి అభిమానులు భారీ ఎత్తున చేరుకుని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు రాయల రాము అభిమానులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేస్తూ, బాణాసంచా కాల్చి అభిమానులు సందడి చేశారు. "జూనియర్ ఎన్టీఆర్ మరిన్ని విజయాలు సాధించి తెలుగు ప్రజల గర్వకారణంగా నిలవాలి" అని అభిమానులు ఆకాంక్షించారు. వేడుకల సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నినాదాలతో మండల కేంద్రాన్ని మార్మోగించారు. ఒకరికి ఒకరు లడ్డూలు తినిపించుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మద్ది రామయ్య, శ్రీనివాస్ రెడ్డి, యువకులు, నందమూరి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్బంగా రోగులకు పండ్లు పంపిణి.






**బయ్యారం/,మే 21.(జర్నలిస్ట్ వార్త)** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బయ్యారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్, జగ్గుతండా సర్పంచ్ జయంతి, వెంకటకృష్ణ లు ఆసుపత్రిలోని రోగులకు డాక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పండ్లు బ్రేడ్ ప్యాకిట్స్ పంపిణి చేసి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవాలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బయ్యారం ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా,జగ్గుతండా ఉపసర్పంచ్ గుంజ వీరాస్వామి,నాయిని శ్రీనివాస్ రెడ్డి,వార్డు సభ్యులు సరీత,జగ్గుతండ వార్డుసభ్యులు, యాకేష్,పావని,దుర్గరావు,కొండపల్లి లక్ష్మి,సత్తిరెడ్డి, భద్రయ్య,జనార్ధన్, వెంకటేశ్వర్లు,క్రాంతి,భావాణి, సూర్యనారాయణ, మల్లయ్య, సైదులు,యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

# శిథిలాల మధ్య విద్యాభ్యాసం

**సంక్షేమ హాస్టళ్లపై అధికారుల నిర్లక్ష్యం -గోపాల్పూర్ హాస్టల్ దుస్థితిపై విద్యార్థులు, తల్లిదండ్రుల ఆవేదన**









**ఎల్కతుర్తి,/ మే 21 (జర్నలిస్ట్ వార్త):** ఒకప్పుడు పేద విద్యార్థులకు భవిష్యత్తు బాటలు వేసిన సాంఘిక సంక్షేమ హాస్టళ్లు నేడు శిథిలావస్థకు చేరుకుని విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారాయి. ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు గోపాల్పూర్ గ్రామంలో నడుస్తున్న సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి రోజురోజుకూ అధ్వాన్నంగా మారుతోంది. డాక్టర్లు, ఇంజనీర్లు, మేధావులను తయారు చేసిన ఈ హాస్టళ్లు ఇప్పుడు కనీస సౌకర్యాలు లేక విద్యార్థులను నరకయాతనకు గురిచేస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హాస్టల్ భవనాల్లో డోర్లు, కిటికీలు విరిగిపోవడం, స్లాబ్ పెచ్చులు ఊడిపోవడం, డార్మిటరీల్లో దోమల బెడద తీవ్రంగా ఉండడం, సరైన బెడ్లు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూములు దయనీయంగా మారగా, ఫ్యాన్లు లేక ఉక్కపోత మధ్య విద్యార్థులు రోజులు గడుపుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం కన్నెత్తి చూడడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 15 రోజులకు ఒకసారి మాత్రమే వార్డెన్..!

హాస్టల్ వార్డెన్ భాస్కర్ రెడ్డి విధుల్లో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 15 రోజులకు ఒకసారి మాత్రమే హాస్టల్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. సమస్యలపై ప్రశ్నించిన వారిని టార్గెట్ చేసి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు.

### ఒకప్పుడు సీటు కోసం పోటీ.. ఇప్పుడు చేరేవారే లేరు

గతంలో ఈ హాస్టళ్లలో సీటు దొరకడం కష్టసాధ్యమైపోయేదని, ఇప్పుడు మాత్రం చేరేందుకు విద్యార్థులే ముందుకు రావడం లేదని గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు. హాస్టళ్లలో కనీస వసతి సౌకర్యాలు లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ పూర్తిగా విఫలం కావడంతో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోందని అంటున్నారు.

### అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

హాస్టళ్లపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితమైపోయారని, లంచాలకు అలవాటు పడి విద్యార్థుల భవిష్యత్తును గాలికొదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూన్‌లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో అయినా హాస్టళ్లను పునరుద్ధరించి విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

### "చరిత్ర కలిగిన హాస్టల్‌ను కాపాడాలి"

ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సభ్యులు ఊటుకూరి రాములు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు నిమ్మల మనోహర్ మాట్లాడుతూ.. "ఒకప్పుడు మేధావులను తయారు చేసిన సాంఘిక సంక్షేమ హాస్టళ్లు నేడు అధికారుల నిర్లక్ష్యంతో కూలిపోతున్నాయి. వార్డెన్లు హాస్టళ్లకు రాకుండా వంటమనుషులపై బాధ్యతలు నెట్టేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హాస్టళ్ల పరిస్థితిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

**జూన్ 2 నుంచి రెండో విడత**

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం**

**సత్తుపల్లి సభలో మంత్రి పొంగులేటి హామీ**



**సత్తుపల్లి/, మే 21 (జర్నలిస్ట్ వార్త):** "ఇల్లు లేని పేదవాడు రాష్ట్రంలో మిగలకూడదు.. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం.. భూమి సమస్యలతో రైతు కార్యాలయాల చుట్టూ తిరిగే రోజులకు ముగింపు పలుకుతాం.." అంటూ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జూన్ 2 నుంచి ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభమవుతుందని ప్రకటించారు. ధరణి కారణంగా తలెత్తిన భూ సమస్యలకు "భూ భారతి" రీ సర్వేతో శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. సత్తుపల్లిలోని ఎంఆర్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన రెవెన్యూ, గృహ నిర్మాణం, అటవీ భూముల సమస్యల సదస్సు రాజకీయ వేడిని తలపించింది. మంత్రి పొంగులేటి సభలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై విస్తృతంగా మాట్లాడగా.. గత ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. "గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కూపంలోకి నెట్టినా.. ప్రజా ప్రభుత్వం సంక్షేమాన్ని ఆపలేదు. రైతు, పేద, మహిళ, యువత.. ప్రతి వర్గానికి అండగా నిలుస్తున్నాం" అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గురుకులాల్లో డైట్ ఛార్జీల పెంపు వంటి పథకాలతో పేదలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇండ్లురాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, ఇప్పటికే 1.25 లక్షల ఇండ్లు పూర్తయ్యాయని తెలిపారు. జూన్ నాటికి మరో లక్ష ఇండ్లు సిద్ధమవుతాయని వెల్లడించారు. ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రూ.5 లక్షలు జమ చేస్తున్నామని చెప్పారు. ప్రతి సోమవారం నిర్మాణ పురోగతిని బట్టి నిధులు విడుదల చేస్తున్నామని వివరించారు. పాలేరు ప్రజాదర్బార్‌లో వచ్చిన 22 వేల దరఖాస్తుల్లో 9,500 గృహాలకు సంబంధించినవేనని పేర్కొంటూ.. "అర్హుడైన పేదవాడికి ఇల్లు రాకుండా ఉండదు" అని స్పష్టం చేశారు.

**ధరణి గందరగోళానికి చెక్**

ధరణి వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి స్పందిస్తూ.. "భూమి సమస్యలతో ప్రజలు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఇక ఉండదు" అన్నారు. బేతుపల్లి, నారాయణపురం ప్రాంతాల్లో సర్వే నిర్వహించి అర్హులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రుద్రాక్షపల్లి, బుగ్గపాడు, వెంకటగిరి తదితర గ్రామాల్లో కొనసాగుతున్న అటవీ-రెవెన్యూ సరిహద్దు వివాదాలను వర్షాకాలానికి ముందే జాయింట్ సర్వే ద్వారా పరిష్కరించాలని సూచించారు

**.ఇసుక కోసం ఇబ్బందులు వద్దు**

ఇందిరమ్మ లబ్ధిదారులను ఇసుక, మట్టి పేరుతో అధికారులు వేధించవద్దని మంత్రి హెచ్చరించారు. ముల్కపల్లిలో కొత్త ఇసుక రీచ్‌కు అనుమతి ఇచ్చామని, అక్కడి నుంచి నాణ్యమైన ఇసుక సరఫరా జరిగేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు.



**సత్తుపల్లి ముందంజలోనే: ఎమ్మెల్యే**

ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలకు కనీసం ఇండ్లు కూడా రాలేదన్నారు. తొలి విడతలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, ఇప్పటికే 1,500 గృహప్రవేశాలు పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ పథకం అమలులో సత్తుపల్లి నియోజకవర్గం ముందంజలో ఉందన్నారు.

**భూ భారతి ద్వారా పరిష్కారం: విజయ్‌బాబు**

రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారానికే "భూ భారతి" పోర్టల్‌ను తీసుకొచ్చామని తెలిపారు. రీ సర్వే ద్వారా పాత పట్టాదారులకు మళ్లీ హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

# ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బాల బదిలీ

**బాలాకు ఆత్మీయ వీడుకోలు పలికిన సెర్ప్ ఉద్యోగులు**







**ఐనవోలు/మే 21 (జర్నలిస్ట్ వార్త):** హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం పంతిని గ్రామంలోని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బాల బదిలీ అయ్యారు. కృష్ణా జిల్లా బందర్ సమీపంలోని కోసూరు బ్రాంచ్‌కు ఆయనను బదిలీ చేస్తూ హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. బాల శుక్రవారం విధులనుంచి రిలీవ్ కానున్నారు.

ఈ విషయం తెలుసుకున్న పర్వతగిరి, వర్ధన్నపేట, ఐనవోలు మండలాల సెర్ప్ ఉద్యోగులు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులు, వీఓఏలు పంతిని బ్యాంకుకు చేరుకున్నారు. మేనేజర్ బాలాకు వారు ఘనంగా ఆత్మీయ వీడుకోలు సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత ఆయనకు పూలబొకేలు అందించి, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీసీ గోలి కొమురయ్య మాట్లాడుతూ మేనేజర్ బాల గత మూడేళ్లుగా బ్యాంకు ఖాతాదారులకు, స్వయం సహాయక బృందాల సభ్యులకు మమేకమై ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఆయన చొరవతోనే పంతిని బ్రాంచ్‌కు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం లభించిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సురేష్, సీసీ ధనుంజయ, వీఓ లీడర్లు మదూరు జ్యోతి, సట్ల లక్ష్మి, భవాని, ఫరీదా బేగం, వీఓఏలు కోదాటి మంజుల, సంతోష, సంధ్య, రాజయ్య, జ్యోతి, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ రైతులకు దక్కని ధర్మం..!

**రిజర్వాయర్ కళ్ల ముందే ఉన్నాడ పొలాలకు చుక్క నీరు లేదు**

**దేవాదుల జలాలు ఇతర ప్రాంతాలకు జలసిరులుడ ధర్మసాగర్ రైతులకు మాత్రం కన్నీటి గాథ**

**కోట్లతో నక్కల తూము నిర్మాణండ కాల్వలు లేక బోసిపోయిన ప్రభుత్వ హామీలు**



ధర్మసాగర్ రిజర్వాయర్

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో మే 21 (జర్నలిస్ట్ వార్త):** ఇది నీళ్లు లేని ప్రాంతం కథ కాదుడ నీళ్లు మధ్యలో ఉండి కూడా సాగునీరు దక్కని రైతుల దుర్దశ. దేవాదుల ప్రాజెక్టు జలాలతో ధర్మసాగర్ రిజర్వాయర్ నిండిపోతున్నాడ అదే రిజర్వాయర్ కింద ఉన్న రైతుల పొలాలు మాత్రం ఎండలతో చిట్లిపోతున్నాయి. వేల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టులు కడుతున్న ప్రభుత్వండ ఆ నీటితో బతికే రైతుల కష్టాలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఐదు భారీ పైప్‌లైన్లతో ధర్మసాగర్ చెరువును నింపి, అక్కడి నుంచి పై ప్రాంతాలకు సాగునీరు తరలిస్తూ ప్రభుత్వం విజయగాథలు చెబుతోంది. కానీ ధర్మసాగర్, దేవునూరు, రాపాకపల్లి, మడిపల్లి, ఉనికిచెర్ల, సోమదేవరపల్లి గ్రామాల రైతుల పరిస్థితి చూస్తే ఆ అభివృద్ధి కథలన్నీ కేవలం ప్రచార ఆర్భాటాలేనన్న భావన కలుగుతోంది.మా ఊర్లో నీళ్లుడ మా కళ్ల ముందే ప్రవహిస్తున్నాయిడ కానీ మా పొలాలకు మాత్రం ఒక్క చుక్క రావడం లేదు” అంటూ రైతులు ఆవేదనతో మండిపడుతున్నారు.



రిజర్వాయర్ కింద ఉన్న సాగు భూములు

సాగునీరు అందిస్తామని హామీలు ఇచ్చి కోట్ల రూపాయలతో నక్కల తూము నిర్మించిన అధికారులుడ కాల్వల నిర్మాణాన్ని మాత్రం పూర్తిగా గాలికొదిలేశారు. తూము నిర్మాణం పూర్తై ఏళ్లు గడుస్తున్నా కాల్వలు లేక ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఒకప్పుడు ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి పాత కాల్వల ద్వారా వేల ఎకరాలకు



నక్కల తూము



దేవాదుల నుండి ధర్మసాగర్ రిజర్వాయర్ లోకి పంపుల ద్వారా

సాగునీరు అందేదని, ఇప్పుడు అవి పూర్తిగా శిథిలావస్థకు చేరి మట్టికాల్వలుగా మారిపోయాయని గ్రామస్తులు చెబుతున్నారు. కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. బోర్లు ఎండిపోవడం, పంటలు వాడిపోవడం, పెట్టుబడులు నీటిలో కలవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉంది.ఎన్నికల సమయంలో రైతుల ఇంటి ముంగిటకు వచ్చే నాయకులుడ సమస్యలు పరిష్కరించాల్సిన సమయంలో మాత్రం కనపడడం లేదని రైతులు మండిపడుతున్నారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వెంటనే స్పందించి కాల్వల నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఇతర ప్రాంతాలకు నీళ్లు పంపే ముందుడ రిజర్వాయర్ కింద ఉన్న రైతుల కడుపు నింపాలి కదా?” అని రైతులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పాత కాల్వలను పునరుద్ధరించి, నక్కల తూము కాల్వల పనులు పూర్తి చేసి సాగునీరు అందించకపోతే రైతులు పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు హెచ్చరిస్తున్నారు.రిజర్వాయర్ నీళ్లు చూస్తూ రైతులు కన్నీళ్లు కార్చే పరిస్థితి రావడండ పాలకుల వైఫల్యానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు.

# కొడుకు, కోడలి మోసం..!

**“భూమి రాయించుకుని వదిలేశారు” -ప్రజాదర్బార్‌లో వృద్ధురాలి కన్నీటి వినతి**



**సత్తుపల్లి,/ మే 21 (జర్నలిస్ట్ వార్త):**“మంచి చెడ్డలు చూస్తాం.. జీవితాంతం చూసుకుంటాం” అంటూ నమ్మించి తన పేరుమీద ఉన్న ఎకరం భూమిని రాయించుకుని, ఇప్పుడు ఇంటి నుంచి దూరం పెట్టారని ఓ వృద్ధురాలు ప్రజాదర్బార్‌లో ఆవేదన వ్యక్తం చేసింది. సత్తుపల్లిలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో వేంసూరు గ్రామానికి చెందిన బొంతు సత్యవతి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎదుట కన్నీటి పర్యంతమైంది.తన కొడుకు, కోడలు మాయమాటలు చెప్పి ఎకరం భూమిని తమ పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఆ తర్వాత తనను పట్టించుకోవడం మానేశారని ఆమె వాపోయింది. ప్రస్తుతం ఆశ్రయం లేక ఇబ్బందులు పడుతున్నానని తెలిపింది. తనకు జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని, ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి తిరిగి భూమిని తన పేరుమీద నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని అధికారులకు వినతిపత్రం అందజేసింది.వృద్ధురాలి గోడును విన్న మంత్రి సంబంధిత అధికారులను విచారణ చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది.

# కరెంటు తీగలు కాటేసిన బాల్యం..!

**విద్యుత్ షాక్‌తో కార్తీక్ మృతి**

**కన్నీరుమున్నీరైన తల్లి..**

**అనాథగా మారిన చిన్నారి కుటుంబం**





**తల్లాడ/, మే 21 (జర్నలిస్ట్ వార్త):** పేదరికంతో పోరాడుతున్న ఓ తల్లి జీవితంలో మరో పిడుగు పడింది. భర్త మృతిని జీర్ణించుకోకముందే.. కూతురు విద్యుత్ షాక్‌కు బలవడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో గురువారం చోటుచేసుకున్న ఈ ఘటన గ్రామస్తులను కలచివేసింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం గ్రామంలోని యాదవుల బజార్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న కంభంపాటి వెంకటమ్మ కుమార్తె కార్తీక్(8) ఇంటి పక్కనే నిర్మాణంలో ఉన్న భవనం వద్ద ఇతర పిల్లలతో కలిసి ఆటలాడుకుంటూ వెళ్లింది. ఈ క్రమంలో అక్కడ నిర్లక్ష్యంగా వదిలేసిన విద్యుత్ తీగలు చిన్నారికి తగలడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. తీవ్ర గాయాలతో తల్లిదండ్రులు, స్థానికులు హడావుడిగా 108 అంబులెన్స్‌లో వైరా ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.చిన్నారి మృతితో తల్లి వెంకటమ్మ రోదనలు హృదయ విదారకంగా మారాయి. “ఒక్కగానొక్క బిడ్డను కూడా దేవుడు తీసుకుపోయాడు” అంటూ కన్నీరుమున్నీరైంది. గ్రామస్తులు సైతం చిన్నారి మృతితో దిగ్భ్రాంతికి గురయ్యారు.కార్తీక్ కుటుంబం వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందినది. కొంతకాలం క్రితమే చిన్నారి తండ్రి మృతి చెందడంతో కుటుంబ భారం మొత్తం వెంకటమ్మపై పడింది. పిల్లలను చదివిస్తూ జీవనం సాగించేందుకు నారాయణపురంలో హోటల్‌లో పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఇలాంటి సమయంలో కుమార్తె మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది.నిర్మాణ ప్రదేశాల్లో భద్రతా చర్యలు లేకపోవడం, ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వదిలేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


# ఎండల్లో చెమటోడ్చుతున్న కూలీలకు చల్లని మజ్జిగ..!

**మనసున్న దాతల సేవకు ఉపాధి కూలీల హర్షం**



**వైరా, /మే 21 (జర్నలిస్ట్ వార్త):**భానుడు భగ్గుమంటున్న వేళ ఉపాధి హామీ పనుల్లో చెమటోడ్చుతున్న కూలీల దాహార్తిని తీర్చేందుకు సిరిపురం కేజీ గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, సోషల్ వర్కర్ షేక్ లతీఫ్ బాయ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మండుటెండలను లెక్కచేయకుండా పనులు చేస్తున్న కూలీల వద్దకే వెళ్లి ఉచితంగా చల్లని మజ్జిగ పంపిణీ చేసి అభినందనలు అందుకున్నారు. వడదెబ్బ భయంతో అలమటిస్తున్న కూలీలకు ఈ మజ్జిగ పంపిణీ ఊరటనిచ్చిందని కూలీలు తెలిపారు. “ఇలాంటి సేవలు చేస్తేనే పేదల కష్టాలు అర్థమవుతాయి” అంటూ దాతలను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ దుప్పటి కృష్ణారావు కూడా పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉపాధి కూలీలు దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, వారు కుటుంబ సమేతంగా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# నీచ స్నేహం కంటే.. నిజాయితీ శతృత్వమే మేలు!



మానవ జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని మలచడంలో స్నేహానికి ఉన్న స్థానం అద్వితీయమైనది. ఒక మనిషి ఎలాంటివాడో తెలుసుకోవాలంటే, అతని స్నేహితులెవరో చూడమంటారు పెద్దలు. అయితే, సమాజంలో అందరితో సత్సంబంధాలు కలిగి ఉండాలనే ఆరాటంలో చాలామంది మంచి-చెడుల మధ్య గీతను మర్చిపోతుంటారు. అందుకే మన పెద్దలు ఒక అద్భుతమైన నిజాన్ని చెప్పారు: చెడ్డ వారితో స్నేహం కంటే మంచి వారితో విరోధం వెయ్యి రెట్లు మంచిది. ఈ మాట పైకి వినడానికి కాస్త వింతగా అనిపించినా, దీని వెనుక ఎంతో లోతైన జీవిత సత్యం దాగి ఉంది.

**ముసుగులో గుద్దులాట కంటే.. ముఖాముఖి పోరాటమే మిన్న**

చెడ్డవానితో స్నేహం అనేది విషసర్పంతో సరసం లాంటిది. వాడు ఎప్పుడు, ఏ రూపంలో మనల్ని ముంచుతాడో ఊహించలేము. చెడ్డవారు స్వార్థపరులు. వారి స్నేహం వెనుక ఏదో ఒక ప్రయోజనం దాగి ఉంటుంది.

వంచన: పైకి ఎంతో తీపి మాటలు చెప్తూ, లోపల గోతులు తవ్వడం చెడ్డవారి నైజం. ప్రమాదకరం,వారి అడుగుజాడల్లో నడవడం వల్ల మన నైతిక విలువలు పతనమవ్వడమే కాకుండా, సమాజంలో గౌరవం కూడా మంటగలుస్తుంది.


దీనికి భిన్నంగా, ఒక మంచివాడు మనకు శత్రువుగా మారినా అతనిలో ధర్మం నశించదు. మంచివానితో విరోధం ఉన్నా, అతను వెన్నుపోటు పొడవడు. శత్రుత్వం ఉన్నా సరే, ఒక నీతి నియమానికి లోబడే ప్రవర్తిస్తాడు.

**నైతికత-వ్యక్తిత్వాల పరీక్ష**

మంచివానితో శత్రుత్వం మనల్ని మరింత జాగరూకులను చేస్తుంది. మన తప్పులను మనం సరిదిద్దుకునేలా ప్రేరేపిస్తుంది. మంచివాడు శత్రువుగా ఉంటే మన ఎదుగుదలకు, ఆత్మపరిశీలనకు తోడ్పడతాడు. అదే చెడ్డవాడు స్నేహితుడిగా ఉంటే, మనకు తెలియకుండానే మనల్ని పతనంలోకి లాగుతాడు.

మహాభారతంలో దుర్యోధనుడికి కర్ణుడు ప్రాణస్నేహితుడే కావచ్చు, కానీ ఆ చెడు స్నేహం వల్లనే కర్ణుడు తన జీవితాన్ని, ధర్మాన్ని కోల్పోయాడు. అదే సమయంలో, శ్రీకృష్ణుడిని శత్రువుగా భావించిన కొందరు కూడా ఆయన ధర్మనితి వల్ల అంతిమంగా మోక్షాన్ని పొందారు.

సమాజంలో బంధాలు, అనుబంధాలు ముఖ్యం. కానీ, కేవలం ఒంటరితనాన్ని దూరం చేసుకోవడానికో లేదా తాత్కాలిక ప్రయోజనాల కోసమో దుర్జనుల స్నేహాన్ని ఆశ్రయించడం ఆత్మహత్యాసదృశ్యం. మంచివారితో వైరం ఉన్నా నష్టం లేదు, ఎందుకంటే వారిలోని సజ్జనత్వం ఎప్పటికీ హద్దులు దాటదు. కాబట్టి, నకిలీ స్నేహాల కంటే, నిజాయితీతో కూడిన విరోధమే మిన్న అని గ్రహించడమే వివేకం. విలువల లేని స్నేహానికి స్వస్తి చెప్పి, సమాజంలో నైతికతను కాపాడుకుందాం.



జర్నలిస్ట్ వార్త ఎడిటర్
బిర్రు కరుణాకర్

# బయ్యారంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు.







**బయ్యారం/,మే 21.(జర్నలిస్ట్ వార్త)**
మాజీ ప్రధాని,భారతరత్న రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బయ్యారం,జగ్గుతండా గ్రామ పంచాయతీల సర్పంచ్ లు గుగులోత్ శాంతి కిషన్ నాయక్,బొల్లి జయంతి వెంకటకృష్ణ పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు వేసిన దార్శనిక నాయకుడిగా రాజీవ్ గాంధీ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. విద్య,సాంకేతికత, గ్రామీణాభివృద్ధి,ఆర్థిక రంగాల్లో ఆయన తీసుకొచ్చిన మార్పులు దేశ ప్రగతికి మూలస్తంభాలుగా నిలిచాయని పేర్కొన్నారు.ఐటీ రంగానికి పునాది వేసి, టెలికమ్యూనికేషన్ విప్లవానికి నాంది పలికిన నాయకుడిగా రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వామ్యాన్ని పెంచారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన సంస్కరణలు నేటికీ ఆదర్శప్రాయమని,ఆధునిక భారత నిర్మాణంలో ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కిషన్ నాయక్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బయ్యారం ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా,జగ్గుతండా ఉపసర్పంచ్ గుంజ వీరాస్వామి,వార్డు సభ్యులు ఎట్టి సరిత,మాజీ జిల్లా కార్యాదర్శి ములుకురి వీరారెడ్డి,కిసాన్ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి, పెద్దినేని వెంకటేశ్వరరావు, జగ్గుతండా వార్డుసభ్యులు గంద్రాతి యాకేష్,బానోత్ స్వాతి,ఈసం పావని,మక్కల దుర్గరావు, కొండపల్లి లక్ష్మి,తగిర సత్తిరెడ్డి,నందగిరి భద్రయ్య,తునికిపాటి క్రాంతి,ఆకునూరి సూర్యనారాయణ, సునీల్, నాగబాబు,పులి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు.





**బయ్యారం/,మే 21.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం కొత్తపేట గ్రామపంచాయతిలో సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి సర్పంచ్ ప్రవీణ్ నాయక్,ఇతర కాంగ్రెస్ నాయకులు పులమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ భారత దేశంలో మొట్ట మొదటిగా టెక్నాలజీని పరిచయం చేసి సమాచార సాంకేతిక పితామహుడిగా రాజీవ్ గాంధీ పేరు పొందారు అన్నారు.యువత రాజకీయాల్లో రాణించాలి అని, ఆయన ఆకాంక్షించారని,దేశ భవిష్యత్ కోసం గాంధీ కుటుంబం త్యాగాలు చేసింది అన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ చాగర్లమూడి భాస్కర్,కారుపోతుల రామ్మూర్తి,గ్రామ పెద్దలు,యువకులు,పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ వర్ధంతి: ఘనంగా నివాళులు

## ఐనవోలులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్మరణ



**ఐనవోలు/ మే 21 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ఐ నవోలు మండల కేంద్రంలో మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు బొమ్మినేని రాకేష్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాలు చేపట్టారు.
ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, దేశ ప్రగతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆధునిక భారత నిర్మాణంలో సమాచార సాంకేతిక (ఐటీ) రంగానికి పునాది వేసిన దూరదృష్టి గల మహోన్నత నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతకు ఓటు హక్కు కల్పించడం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పోలెపల్లి శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందనం, వనమాలకనపర్తి, పెరుమండ్లగూడెం, ముల్కలగూడెం గ్రామాల సర్పంచులు జెట్టబోయిన రాజు, ఎల్ల స్వామి, దుప్పెల్లి రాకేష్, నల్లబోతుల రాధికా లింగరాజు, ఉపసర్పంచులు అనిల్, నోముల కుమార్, వార్డు మెంబర్ మార్నేని లక్ష్మణ్ రావు, నాయకుడు ఆరూరి అశోక్, యువజన, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇరాన్‌తో తలగొక్కున్న అమెరికా

## భారీగా పెరిగిన సైనిక వ్యయం -సుమారు రూ.2.4 లక్షల కోట్లు చేరినట్లు అంచనా



**వాషింగ్టన్,మే 21 (జర్నలిస్ట్ వార్త):** :ఇరాన్ పై యుద్ధంతో అమెరికాకు భారీ నష్టం వాటిల్లిందని యుఎస్ కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ (సిఆర్ఎస్ ) ఒక నివేదికలో తెలిపింది.ఈ నష్టాల కారణంగా పెంటగాన్ అంచనా వేసిన సైనిక కార్యాచరణ వ్యయం భారీగా పెరిగి 29 బిలియన్ డాలర్లకు అంటే సుమారు రూ.2.4 లక్షల కోట్లు చేరినట్లు తెలిపారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్ పై దాడులకు దిగిన సంగతి తెలిసిందే. ఈ యుద్ధంలో అమెరికాకు చెందిన సుమారు 42 అత్యాధునిక యుద్ధ విమానాలు, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు పూర్తిగా ధ్వంసమవ్వడమో లేదా తీవ్రంగా దెబ్బతినడమో జరిగిందని ఈ నివేదిక పేర్కొంది. వర్గీకరణ, కొనసాగుతున్న పోరాట కార్యకలాపాలు, బాధ్యతను గుర్తించడం వంటి పలు కారణాల వల్ల దెబ్బతిన్న లేదా ధ్వంసమైన విమానాల సంఖ్య సవరణకు లోబడి ఉండవచ్చని సిఆర్ ఎస్ తెలిపింది. ధ్వంసమైన లేదా దెబ్బతిన్న వాయుసేన ఆస్తులలో అత్యధికంగా 24 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, ఒక ఎంక్యూ-4సి ట్రిటాన్ డ్రోన్ ఉన్నాయి. వీటితో పాటు నాలుగు ఎఫ్-15ఇ స్ట్రైక్ ఈగిల్ ÷ైటర్ జెట్లు, ఒక అత్యాధునిక ఎఫ్-35ఎ లైట్నింగ్ ఎఎ స్టీల్త్ ÷ైటర్ జెట్, ఒక ఎ-10 థండర్‌బోల్ట్ గ్రౌండ్-అటాక్ ఎయిర్‌క్రాఫ్ట్ కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. శత్రువుల దాడిలో ఏడు కెసి-135 స్ట్రాటోట్యాంకర్ రీఫ్యూయలింగ్ విమానాలు, ఒక ఇ-3 సెంట్రీ అవాక్స్ (ఎడబ్ల్యుఎసిఎస్ ), నిఘా విమానం, రెండు ప్రత్యేక ఆపరేషన్ల విమానాలు, ఒక హెచ్‌హెచ్-60డబ్ల్యూ రెస్క్యూ హెలికాప్టర్ దెబ్బతిన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. యుఎస్ కాంగ్రెస్, కమిటీలకు విధానపరమైన, చట్టపరమైన విశ్లేషణను అందించే సిఆర్ ఎస్, రక్షణ శాఖ, యుఎస్ సెంట్రల్ కమాండ్ వార్తా నివేదికలు, ప్రకటనలను పరిశీలించడం ద్వారా ఈ నష్టాలను అంచనా వేసింది. అమెరికా రక్షణ శాఖ ఇప్పటివరకు అధికారికంగా నష్టాల పూర్తి వివరాలను వెల్లడించనప్పటికీ, దెబ్బతిన్న యుద్ధ పరికరాల మరమ్మతులు, పునరుద్ధరణ ఖర్చులు ఊహించిన దానికంటే విపరీతంగా పెరిగాయని పెంటగాన్ తాత్కాలిక కాంప్ట్రోలర్ జూల్స్ డబ్ల్యు హర్ట్స్ ఎఎ ప్రతినిధుల సభలో అంగీకరించిన సంగతి తెలిసిందే.
--------

# విదేశీ పర్యటన ముగించుకున్న ఢిల్లీకి ప్రధాని మోడీ

## విదేశీ ప్రతినిధులకు విలువైన కానుకలు అందచేత

**న్యూఢిల్లీ,మే 21 (జర్నలిస్ట్ వార్త):** పధాని నరేంద్ర మోదీ ఐదు దేశాల పర్యటనను ముగించుకుని గురువారం భారత్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనల నేపథ్యంలో మోదీ ఆయా దేశాల నేతలకు భారత సంస్కృతి ఉట్టిపడేలా పలు కానుకలు అందజేశారు. ఇటలీ అధ్యక్షుడికి పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎంఎస్ సుబ్బలక్ష్మి పాటల సీడీలు కలిగిన మార్బుల్ ఇన్‌లే వర్క్ బాక్స్‌ను బహుమతిగా ఇచ్చారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అస్సాంలో ఫేమస్ అయిన ముగా సిల్క్ శాలువాను బహుకరించారు. తెల్లని పాలరాయితో తయారుచేసిన ఈ బాక్స్‌పై లాపిస్ లాజులి, టర్కోయిస్, మాలకైట్, పగడం వంటి రాళ్లను అలంకరించారు. ఈ పె÷-టటె లోపల భారత శాస్త్రీయ సంగీతంలోని ప్రముఖులైన పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎంఎస్ సుబ్బలక్ష్మి పాడిన పాటల సీడీలు ఉన్నాయి. ఇక, మెలోనీకి.. అస్సాంలో 'గో÷-డలెన్ సిల్క్'గా గుర్తింపుపొందిన ముగా సిల్క్ శాలువాను బహుమతిగా ఇచ్చారు. మణిపుర్‌కు చెందిన శిరుయ్ లిలీ సిల్క్ స్కార్ఫ్‌ను కూడా గిఫ్ట్‌గా ఇచ్చారు. నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌కి చేపల ఆకృతితో ఉన్న మధుబని పెయింటింగ్‌ను బహుమతిగా ప్రధాని మోదీ అందజేశారు. ఈ మధుబని పెయింటింగ్ అత్యంత ప్రాచీనమైనది. ఈ పెయింటింగ్ భౌగోళిక గుర్తింపు పొందింది. జానపద కళను ప్రతిబింబించే ఈ పెయింటింగ్‌లు.. భారత్, నేపాల్‌లోని మిథిలా ప్రాంతంలో ఉంటాయి. పండగలు, వివాహాలు, ఆచార వ్యవహారాలు తదితర శుభకార్యాలకు సూచికగా ఈ పెయింటింగ్స్ వేస్తారు. ఈ మధుబని పెయింటింగ్స్‌కు సంబంధించిన మూలాలు భారతీయ పురాణాలు, జానపద కథల్లో ఉన్నాయి. పువ్వులు, పక్షులు, చెట్లు, చేపల వంటి ఆకృతుల ద్వారా దేవతలు, ప్రకృతితోపాటు రోజువారీ జీవిత దృశ్యాల ఈ పెయింటింగ్స్‌లో కనిపిస్తాయి. నెదర్లాండ్స్ ప్రధానికి ఈ కానుక ఇవ్వడం ద్వారా భారతీయ సంస్కృతి, ముఖ్యంగా మిథిలా కళారూపాన్ని పరిచయం చేసినట్లు అయిందనే చర్చ సాగుతోంది.

# భద్రతా మండలిలో మరోమారు పాక్ దుర్నీతి

## గట్టిగా తిప్పికొట్టిన భారత్ ప్రతినిధి

## నరమేథం చేసే పాక్‌కు మాట్లాడే హక్కులేదని విమర్శలు

**న్యూఢిల్లీ,మే 21 (గుడివాడ మెయిల్):**
అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో భారత్‌పై నిందలు మోపేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే, భారత్ వీటిని గట్టిగా తిప్పికొట్టింది. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది.సాయుధ ఘర్షణల్లో పౌరులకు రక్షణ కల్పించే అంశంపై ఐరాసలో బహిరంగ చర్చ జరిగింది. ఈ సందర్భం గా పాక్ ప్రతినిధి జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ గట్టిగా తిప్పికొట్టారు. నరమేధ చర్యలకు పాల్పడే దేశం.. భారత అంతర్గత విషయాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ఏడాది ఆరంభంలో అఫ్గానిస్థాన్ పై పాక్ జరిపిన దాడుల గురించి హరీష్ ప్రస్తావించారు. పవిత్ర రంజాన్ మాసంలో కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన దాడిని ప్రపంచం ఇంకా మరిచిపోలేదన్నారు. ఈ అమానుషమైన హింసాకాండలో 269 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 122 మంది గాయపడినట్లు తెలిపారు. 'చీకట్లో అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ.. అంతర్జాతీయ చట్టాల గురించి మాట్లాడటం పాక్ కపటత్వానికి నిదర్శనం' అని విమర్శించారు. తన సొంత ప్రజల పైనే బాంబులు వేస్తూ, జాతి నిర్మూలనకు పాల్పడే దేశం ఇలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడటంలో పెద్ద ఆశ్చర్యం కలిగించే విషయం కాదన్నారు.
-----------


# రేవంత్ ఆలోచనకు తగ్గట్లుగా ఫ్యూచర్ సిటీ కదిలేనా ?

**మే 21 (జర్నలిస్ట్ వార్త):**
రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు దాటింది. ఇక రేవంత్ రెడ్డికి ఉన్నది కేవలం రెండేళ్ల కాలం మాత్రమే. ఈ రెండేళ్లలో ఆయన అనుకున్న పనులు నెరవేరుస్తారా అన్నది అనుమానమే. ఎందుకంటే ఈ రెండున్నరేళ్లలో గట్టిగా ఒక నిర్మాణాత్మక పనికూడా చేపట్టలేదు. ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయాలేదు. ఎందుకంటే కేవలం సంక్షేమాలతో నెట్టుకు వస్తున్నారు. రేషన్ కార్డులు పెంచడం, సన్నబియ్యం ఇవ్వడం, రైతు భరోసా వేయడం వంటివన్నీ అభివృద్ధి కిందకు రావు. ఈ క్రమంలో ఆయన పెద్ద పనిని తలన పెట్టుకున్నారు. అదే ఫ్యూచర్ సిటీ. ఇప్పుడున్న హైదరాబాద్ ఇంతగా పెరగడానికి కొన్ని దశాబ్దాలు పట్టింది. మెల్లాగా ఇది అల్లుకుంటూ పోవడం వల్ల పెరిగందే తప్ప రాత్రికి రాత్రి పెరగలేదు. చంద్రబాబు సైబరాబాద్‌కు బీజం వేసినా, ఇవాళ ఓఆర్ఆర్ వరకు నగరం విస్తరించడానికి దాదాపు రెండున్నర దశాబ్దాల కాలం పట్టింది. అందువల్ల ఒక సిటీని కట్టాలంటే అనుకున్నంత ఈజీగా అమాంతంగా కట్టలేం. అమరావతి కోసం నిధులు ఉండీ చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. మధ్యలో జగన్ మావిగన్ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అమరావతి ఇప్పట్లో పూర్తి అయ్యేలా లేదు. పోలవరం కట్టడానికి దాదాపు 15 ఏళ్లు పట్టింది. నిధులు ఉండి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తే ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగవచ్చు. కానీ ఫ్యూచర్ సిటీ కోసం రూపాయి కూడా వెచ్చించడానికి లేదు. నిధుల లేమి రాష్ట్రాన్ని పట్టి పీడిస్తోంది. అక్కడ భూములు సేకరించి ఉన్నాయి కనుక ఫ్యూచర్ సిటీ కట్టేయలేం. కొన్ని కార్యాలయాలు తరలించినా, కొందరికి భూములు కేటాయించినా ఇది సాధ్యం అయ్యే పనికాదు. దీనికి తోడు కేవలం రెండంటే రెండేళ్ల కాలం మాత్రమే ఉంది. ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, నెట్ జీరో తరహాలో రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందులో ఎలాంటి రాజీ పడొద్దని కూడా చెప్పారు. ఈ మేరకు ప్రపంచస్థాయి నగరాలను అధ్యయనం చేసి ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ఇప్పటికే అక్కడ ఓ ఈవెంట్ నిర్వహించి, పెట్టుబడిదారులను ఆహ్వానించినా, అక్కడ ఎలాంటి మౌళిక వసతులు లేకుండా ఎలా అడుగు వేస్తారో అధికారుకలకు కూడా అర్థం కాదు. ఫ్యూచర్ సిటీలో భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటు అంశాలపై ఎన్ని ఆదేశాలు జారీ చేసినా నిర్దిష్ట ప్రణాళిక మేరకు ముందుకు సాగాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల కోసం 500 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. మౌలిక సదుపాయాల నిర్మాణం తర్వాతే భూ కేటాయింపులు జరపాలన్నారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకువచ్చేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను కూడా తీసుకొద్దామని, అవసరమైతే ప్రధాని నరేంద్రమోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామన్నారు. జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమల నిర్మాణం ప్రారంభించేలా నిబంధనలు రూపొందించాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించటం కోసం 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరిట ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని, దీనికి లోగో, వెబ్‌సైట్ రూపొందిం చాలని ఆదేశించారు. పెట్టుబడులకు ముందుకొచ్చేవారికి ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను తీసుకురావాలని, గ్రూప్-1 స్థాయి అధికారులను నియమించాలన్నారు.

# తిరుమలలో పెరిగిన రద్దీ

## వేసవి సెలవులతో భక్తుల రాక

## దర్శనానికి 24గంటలకు పైగా సమయం



**తిరుమల,మే 21 (జర్నలిస్ట్ వార్త):**
వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో రద్దీ పెరుగుతోంది. శ్రీవారి దర్శనానికి కనీసం 24 గంటలపైగా సమయం పడుతోంది. శ్రీవారి దర్శనానికి గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. దీంతో భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్2, నారాయణగిరి షెడ్స్ నిండిపోయి రింగ్ రోడ్డులోని పాచికాల్వ గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లో సుమారు నాలుగు కిలోమీటర్లు వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 24 గంటలపైగా సమయం పడుతోందని తితిదే ప్రకటించింది. రద్దీ నేపథ్యంలో సంయమనంతో శ్రీవారిని దర్శించుకోవాలని తితిదే భక్తులకు సూచిస్తోంది. మరోవైపు తితిదే ఆధ్వర్యంలో ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు, అన్నప్రసాద కేంద్రాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులు ఎప్పటికప్పుడు అంచనా వేసి, అధికారులు అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పాలు, అన్న ప్రసాదాలు శ్రీవారి సేవకుల ద్వారా అందిస్తున్నారు. తితిదే యంత్రాంగం సమన్వయంతో భక్తులకు దర్శనం కల్పించేందుకు 24 గంటలూ ప్రత్యేకంగా దృష్టి సారించారు. పోలీసులు, తితిదే విజిలెన్స్ అధికారులు రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి రద్దీని నియంత్రిస్తున్నారు. రద్దీ నేపథ్యంలో అధికారులు భక్తులను క్యూలైన్లలోకి అనుమతించడం లేదు.